క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్‌బజార్ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు, హనుమాన్ నగర్, సగర కాలనీ, కాకతీయ యూనివర్సిటీ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11.30 గంటల వరకు, న్యూశాయంపేట ప్రాంతంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, శాయంపేట, బాలసముద్రం సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, యాదవనగర్, ఆర్ఈసీ, వెస్ట్ సిటీ, సోమిడి, మడికొండ, రాంపూర్ సబ్‌స్టేషన్ల ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. సీకేఎం కళాశాల, లక్ష్మి మెగా టౌన్‌షిప్, రంగనాయకస్వామి దేవాలయం, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బొల్లికుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: ఎల్లాపురం, నాగారం, దేవన్నపేట, మల్లారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సామ్యనాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదని పేర్కొన్నారు.

19న మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

హన్మకొండ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని 51, 52వ డివిజన్ల మున్సిపల్ కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 19న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరగనున్న ధర్నాకు మున్సిపల్ కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు బరుపట్ల మహేష్, నాయకులు కుమార్, కవిత, కార్మికులు పాల్గొన్నారు.

అంధులను ఆదరించాలి



వరంగల్: అంధులకు ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ కోరారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద గురువారం రాత్రి ఓ అంధుడు తన మధురమైన గానంతో జానపద పాటలు పాడుతూ భిక్షాటన చేస్తుండగా, ఆ సమయంలో అటువైపు వెళ్లిన మహేష్.. అంధుడిని చూసి చలించిపోయి ఆర్థిక సాయాన్ని అందించారు. అంధుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చూస్తానని మహేష్ హామీ ఇచ్చారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలను క్రైస్తవప్రార్థన క్షేత్రంగా మార్చారని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ విభాగ్ సహాయ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ మాట్లాడారు. కళాశాలలోకి పాస్టర్‌ను ఆహ్వానించి మత ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మహానగర కార్యదర్శి వెలగందుల రాజు, సహ కార్యదర్శి సందీప్‌రెడ్డి, నాగుల ప్రసాద్, నాగరాజు, భజరంగ్ దళ్ సంయోజక్ బండి రోహిత్ యాదవ్, కనుకుంట్ల వెంకట్, పత్తిపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సట్టా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలా వరంగల్: ఆన్‌లైన్ సట్టా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వేగేట్ శాంతినగర్‌లో బండి రాజు, మార్త రాజయ్య ఇళ్లల్లో ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ ఆధ్వర్యంలో ఏకకాలంలో శుక్రవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. సట్టా నిర్వాహకులు బండి రాజు వద్ద రూ.4,680 నగదు, సట్టా చిట్టీలు, మార్త రాజయ్య వద్ద రూ.1,920ల నగదు, సట్టా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ వివరించారు.

ప్రమాదకరంగా ప్రయాణం

- వీధి దీపాలు లేని ఖమ్మం బైపాస్‌రోడ్డు
- రోడ్డును కమ్మేస్తున్న తుమ్మ పొదలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు



బైపాస్ రోడ్డులో అలుముకున్న చీకటి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని కడిపికొండ నుంచి అమ్మవారిపేట వరకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కడిపికొండ ఆర్వోబీ మీదుగా ఖమ్మం బైపాస్‌రోడ్డుకు నిత్యం భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈక్రమంలో బైపాస్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే, రోడ్డుకు ఇరువైపులా, డివైడర్ మధ్యలో తుమ్మ చెట్లతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏపుగా పెరిగిన తుమ్మలు

నగర సుందరీకరణలో భాగంగా స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందిన అనతి కాలంలో బైపాస్‌రోడ్డుగా కడిపికొండ నుంచి అమ్మవారిపేట మీదుగా ఉర్సు వరంగల్‌కు వెళ్లే ఖమ్మం బైపాస్‌రోడ్డు అభివృద్ధి చెందింది . ఈక్రమంలో రహదారికి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి మొక్కలు ఏర్పాటు చేశారు. బల్దియా అలసత్వం కారణంగా డివైడర్లలో మొక్కలతో పాటు తుమ్మ చెట్లు కూడా పెరిగి వృక్షాలుగా మారి రోడ్డును కమ్మేస్తున్నాయి. తుమ్మ పొదల కారణంగా ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తుమ్మ చెట్లను తొలగించాలని నగరవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

దివ్యాంగులకు చేయూతనందించాలి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న అతిథులు

హన్మకొండ: దివ్యాంగులకు చేయూతనందించాలని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సాయిరమేష్ సూచించారు. హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల ముగింపు సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని, వారి హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా చైర్మన్ సత్యనారాయణ, తెలంగాణ చైర్మన్ రామ్మోహన్, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నవీన్, స్పందన నిర్వాహకులు సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత, ప్రభాకర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

జూడో పోటీల్లో జంపయ్యకు కాంస్యం



జంపయ్యతో కోచ్ రాము

వరంగల్ స్పోర్ట్స్: పంజాబ్‌లోని లూథియానాలో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ అండర్ -19 జాతీయ స్థాయి జూడో పోటీల్లో పరకాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జంపయ్య పాల్గొని ప్రతిభ కబరిచి కాంస్య పతకాన్ని సాధించాడు. అండర్ -50 కిలోల విభాగంలో నాలుగు మ్యాచ్‌ల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులను జంపయ్య మట్టికరిపించి విజయం సాధించాడు. ఈమేరకు జంపయ్య, జూడో కోచ్ చందనగిరి రామును భారత జూడో సమాఖ్య కోశాధికారి బైరబోయిన కైలాస్‌యాదవ్, ఎస్‌జీఎఫ్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వరంగల్ జూడో సంఘం బాధ్యుడు సంతోష్, పరకాల గురుకుల ప్రిన్సిపాల్ సమ్మయ్య అభినందించారు.

18 నుంచి శివానందమూర్తి జయంతి



జయంతి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు సద్గురు శివానందమూర్తి 96వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. గురుధామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న ఉదయం భారతీయ సంస్కృతి - పరిరక్షణ వికాసం - నేటి యువత పాత్ర అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 19న ఉదయం భగవద్గీతలోని రెండవ అధ్యాయం 48, 50 శ్లోకాలు, మూడో అధ్యాయం ఏడో శ్లోకం మూడింటిపై ఉచ్చరణ, తాత్పర్యం చెప్పిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, సంపత్, రాజా మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లడం దారుణం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: దేశానికి అన్నం పెట్టే రైతన్నను అవమానకరంగా బేడీలు వేసి ఆస్పత్రికి తరలించడం దారుణమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైరి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చే రైతు రాజ్యం ఇదేనా అని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాకం హరిశంకర్, రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, మాచర్ల దీన్‌దయాళ్, మాదాసి రాజు, బైరి శ్యామ్, రజనీష్, రాజేందర్, కర్నె రవీందర్, కాసు శిల్ప, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌ను బాధ్యతల నుంచి తప్పించాలి



ధర్నా చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కాళోజీ సెంటర్: సరైన అర్హత లేకుండా వరంగల్ జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా కొనసాగుతున్న జ్ఞానేశ్వర్‌ను ఆ బాధ్యత నుంచి తొలగించాలని టీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు స్వీకరించాలంటే కనీస అర్హత బీఈడీ ఉండాలని, అయితే, బీకాం పూర్తిచేసిన జ్ఞానేశ్వర్‌ను ఇన్‌చార్జ్ డీఈఓగా ఎలా కొసాగిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ సిటీ ప్రెసిడెంట్ నాగారం మణితేజ, సెక్రటరీ సాంబరాజు, ఇటకాయల బన్నీ, కానుగంటి కుమార్, బొందుగుల సంతోష్, సన్నీ, శ్రీకాంత్, సందీప్, రాకేష్, అఖిల్, మనోజ్, రోహిత్, కార్తీక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చలికోట్ల పంపిణీ



దేశాయిపేట: చలికోట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సురేష్‌జోషి



మడికొండ: కార్మికులకు స్వెటర్లు అందజేస్తున్న కార్పొరేటర్ సరోజన, తదితరులు



ఖిలా వరంగల్: పారిశుద్ధ్య కార్మికులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సువర్ణ

వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వింటర్ జాకెట్లను (చలికోట్లు) శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, నాయకులు అందజేశారు. దుస్తులను వినియోగించుకోవాలని సూచించారు.

ఐక్య క్రిస్మస్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కాజీపేట: వరంగల్ మహానగర మెగా ఐక్య క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈమేరకు కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో బిషప్ డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 15న సాయంత్రం ఫాతిమానగర్‌లో జరగనున్న 12వ వరంగల్ మహానగర క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. బిషప్ డానియల్ కల్యాణ్, బిషప్ జాన్ మార్కండేయ, ఫాదర్ తాటికొండ జోసఫ్, ఫాదర్ మర్రెడ్డి, ఫాదర్లు సుధీర్, అనుకిరణ్, పాస్టర్ జోష్, సీటీ రవికిరణ్ పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి



ఖిలా వరంగల్: బీసీలు రాజ్యాధికారం వైపు పయనిస్తూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన బీసీ హక్కుల సాధన సమితి సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తమ వాటా సాధించుకునే దిశగా బీసీ హక్కుల సాధన సమితి తీసుకుంటుందన్నారు. సమావేశంలో కుమారస్వామి, ప్రకాశ్, వెంకన్న, నరేష్, మహిపాల్, సౌందర్య, లక్ష్మి, రజిని, సాంబయ్య, సువర్ణ పాల్గొన్నారు.

చేపల పెంపకంలో జాగ్రత్త

ఖిలా వరంగల్: చేపల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గణేష్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురంలో కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో చేపల పెంపకం, ఆరోగ్యంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మేకల సూరయ్య, రాము, మేకల శంకర్, స్వామి, భిక్షపతి, రాములు, రాజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా ఆగని సంక్షేమం



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో పశ్చిమ నియోజవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. 106 మందికి రూ.1,06,12,296 విలువ కలిగిన కల్యాణలక్ష్మి చెక్కులు, 75 మందికి రూ.29,99,500 విలువైన షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ఏడాది పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమన్యాయం చేసినట్లు తెలిపారు. అధికారులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

హన్మకొండ అర్బన్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపి నేటి వరకూ విధి, విధానాలు ప్రకటించలేదని, నిధులు కేటాయించలేదని, పాలకవర్గాన్ని ప్రకటించలేదని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈక్రమంలో రెడ్డి కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరారు. సంఘం నాయకులతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు గంగిడి ప్రభాకర్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి, రావుల నర్సింహరెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, సంకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

విద్యారణ్యపురి: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గో రోజుకు చేరుకుంది. సమ్మెకు వినయభాస్కర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు గతంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.షఫి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, కరుణశ్రీ, అర్చన, మనోజ, తండ రమేష్, చొప్పరి శోభన్, ఇందిరా, బానోతు స్వామి, రావుల రాజేందర్, లోకేష్, మేనక సర్పల, స్వర్ణ, లత, అరుణ, మంజుల పాల్గొన్నారు.

కష్టజీవుల కడలి తరంగం సోమ రాజన్న



నివాళులర్పిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: దోపిడీ, అవినీతి పాలకులు పోయి కష్టజీవుల రాజ్యం రావాలని నిరంతరం పరితపించి తుది వరకు ఎర్ర జెండా పట్టుకుని పోరాడిన యోధుడు సోమ రాజన్న అని ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అన్నారు. సోమ రాజన్న 10వ వర్ధంతి సందర్భంగా నగర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ పీడిత, తాడిత ప్రజల ఉద్యమ నాయకుడు, పార్టీ అగ్రనేతల్లో సోమ రాజన్న ఒకరని పేర్కొన్నారు. అసెంబ్లీ టైగర్ అమరజీవి మద్దికాయల ఓంకార్ అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కోసం, ప్రజల కోసం నిక్కచ్చిగా పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, కమిటీ సభ్యులు ఐతం నాగేష్, అప్పనపురి నర్సయ్య, మాలి ప్రభాకర్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు రీడింగ్ ప్యాడ్ల పంపిణీ



రీడింగ్ ప్యాడ్లు అందుకున్న అభ్యర్థులతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులకు 100 రీడింగ్ ప్యాడ్లను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ శుక్రవారం అందజేశారు. కష్టపడివ చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని జిల్లా గ్రంథాలయంలోని చైర్మన్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బిన్నీ లక్ష్మణ్, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, లైబ్రరీ జూనియర్ అసిస్టెంట్ సంతోష్, టైపిస్టు కుమారస్వామి, సిబ్బంది గుడికందుల రాజేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన కడిపికొండ శివారులోని రాజీవ్ గృహకల్ప సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యపురం గ్రామానికి చెందిన జేరిపోతుల వీరలక్ష్మి.. పనినిమిత్తం తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై దర్గాకు వెళ్లి తిరిగి అయోధ్యపురం గ్రామానికి వెళ్తుండగా బాపూజీనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న టాటాఏస్ ట్రాలీ ఆటో.. ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీ కొట్టింది. దాంతో వీరలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కుమారుడు తరుణ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ వివరించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన బోడగుట్ట ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం బోడగుట్ట ప్రాంతానికి చెందిన ఎండీ.ఆజాద్ (19) గత కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 10వ తేదీన కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ తెలిపారు. మృతుడి తండ్రి అజీమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

వరంగల్: హనుమకొండకు చెందిన తహీర జాబీన్.. శుక్రవారం వరంగల్ మండిబజారుకు వెళ్లిన సమయంలో రూ.30వేల ఉన్న చేతిబ్యాగు పొరపాటున పోగొట్టుకుంది. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ బ్యాగును గుర్తించి సదరు మహిళకు తిరిగి అప్పగించారు.

కేయూ ఎంఈఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ సుజాత, ఉపాధ్యక్షులుగా సుమన్, ఎం.ప్రవీణ్, ఎస్.ఐలయ్య, విజయలక్ష్మి, కార్యదర్శులుగా సాయిప్రసాద్, మహర్షి, ఎమీల్య, మహిళా కార్యదర్శిగా పద్మావతి, సహాయ కార్యదర్శులుగా ఎం.బాబు, దేవమ్మ, కోశాధికారిగా ఎస్.సుమన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దేవదాసు, సాగర్, శ్రీనివాస్, గట్టయ్య, రణధీర్, నవీన్, నాగరాజు కుమార్, శోభన్‌కుమార్, ముఖ్య సలహాదారుడిగా సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంచంద్రం వ్యవహరించనున్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కాజీపేట రూరల్: హసన్‌పర్తి మండల కేంద్రంలో శుభం గార్డెన్స్‌లో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని కాజీపేట పార్టీ సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య సూచించారు. కాజీపేట దర్గాలో తొట్టె మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, సంటి రవి, మదన్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ పూర్తి

వరంగల్: నాలుగు రోజుల నుంచి ఎస్ఆర్‌నగర్‌లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో ప్రాథమిక విచారణ జరిపించామని వరంగల్ తహసీల్దార్ ఎండీ.ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిషయంలో ఎస్ఆర్‌నగర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా కొందరు గొడవలు సృష్టిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. గొడవలకు కారణమైన స్థలం ప్రభుత్వ భూమి అని, దానిపై సమగ్ర విచారణ చేయనున్నట్లు వివరించారు.

ముగిసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడలు

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ వరంగల్, ఖిలా వరంగల్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. వరంగల్‌లోని ఓ సిటీ స్టేడియంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మూడు రోజులపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శంకర్‌లింగం, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: విద్యాశాఖ మంత్రిని ఇప్పటివరకు నియమించకపోవడాన్ని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నేటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గౌతమ్, రాహుల్‌కిరణ్, రాజ్, సాయి, సూర్యతేజ్, చైతన్య పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఆటో స్టాండ్ ప్రారంభం

హన్మకొండ: హనుమకొడ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని ఇందిరానగర్ కూడలిలో కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆటో స్టాండ్‌ను కాంగ్రెస్ 59వ డివిజన్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు తేళ్ల సుగుణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రవి కిరణ్, తాళ్లపల్లి సుధాకర్, తాళ్లపల్లి విజయ్, రవీందర్, ఆరిఫ్, అక్మల్, అబ్దుల్లా, కాకతీయ ఆటో యూనియన్ నాయకులు రఘు, ఎం.దేవేందర్ రెడ్డి, షఫీ, ఇందిరానగర్ ఆటో స్టాండ్ అధ్యక్షుడు సాయిబాబా, ఉపాధ్యక్షుడు కోటి, సెక్రటరీ ఎండీ.షఫీ, నాయకులు సురేందర్, విష్ణు, రమేష్, రఘు పాల్గొన్నారు.

చిప్ప వెంకటేశ్వర్లుకు సన్మానం

రామన్నపేట: ఈనెల 9న ఢిల్లీలో దళిత సాహిత్య అకాడమీ వార్షికోత్సవాల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డు అందుకున్న చిప్ప వెంకటేశ్వర్లు శుక్రవారం నగరానికి చేరుకోవడంతో ఆయనను మిత్ర బృందం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా కొత్తవాడలోని 80ఫీట్ల రోడ్డు అమరవీరుల స్తూపం వద్ద వెంకటేశ్వర్లును పద్మశాలి, చేనేత, బహుజన నాయకులు సన్మానించారు. మాజీ కార్పొరేటర్ దామెర సర్వేష్, మండల శంకర్, బేతి అశోక్, రాజేందర్, సంపత్, సాంబయ్య, హైదర్, నరేష్, ఈగ శ్రీధర్, పిట్ట రాములు, రవి, దాన రాజయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ దేవాలయంలో వ్రతం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి పంచామృతాలతో అభిషేకం, సింధూర విలేపనం, అలంకరణ పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణతో పాటు మహాన్నదానం చేశారు.